క్లుప్తంగా

చెంచు గర్భిణికి పరామర్శ



నాగర్‌కర్నూల్ క్రైం: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రక్త హీనతతో బాధపడుతూ చికిత్స పొందుతున్న చెంచు గర్భిణి బయ్యమ్మను శుక్రవారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రవికుమార్‌నాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తం తక్కువగా ఉన్నందున రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రెండు యూనిట్ల రక్తాన్ని ఎక్కించామని చెప్పారు. ఆరోగ్యవంతమైన పిల్లల కోసం రక్తహీనత లేకుండా వైద్యుల సూచనల మేరకు అవసరమైన మాత్రలు వేసుకోవాలని సూచించారు.

ఆర్థిక సాయం అందజేత



తాడూరు: అనారోగ్యంతో మృతిచెందిన పీఈటీ ప్రసాద్‌గౌడ్ కుటుంబానికి శుక్రవారం పీఆర్టీయూ నాయకులు శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్‌రావు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. క్రియాశీలక సభ్యుడికి సహకారం అందించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంక్షేమ నిధి నుంచి నగదు ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి మంజూరు చేయించారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కుటుంబ సంక్షేమ నిధి బాండ్ల పంపిణీ

పెంట్లవెల్లి: టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, శ్రీధర్‌శర్మ, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ చిన్నయ్య ఆధ్వర్యంలో శుక్రవారం మండలానికి చెందిన టీఎస్ యూటీఎఫ్ నాయకులకు కుటుంబ సంక్షేమ నిధి బాండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ చిన్నయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుడు వృత్తిలో ఉండి మృతిచెందితే కుటుంబ కుటుంబ సంక్షేమ నిధి పథకంలో సభ్యుడికి రూ.6 లక్షలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు క్రాంతికుమార్, రమేష్‌నాయక్, ఉపాధ్యక్షులు కృష్ణ, యాదగిరి, కోశాధికారి చంద్రమౌళి, కార్యదర్శులు నరేందర్, రాఘవేంద్ర, మహేష్, జిల్లా కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

కొల్లాపూర్: మున్సిపాలిటీలోని 10వ వార్డులో పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మహిమూదాబేగం, కమిషనర్ రాజయ్య, కౌన్సిలర్ రహీంపాష శుక్రవారం భూమిపూజ చేశారు. వార్డులో మురుగు కాల్వలు, సీసీ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. పట్టణ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజలకు ఉపయోగపడే పనులను విడతల వారీగా చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగినేని జగదీశ్వరుడు, ఖాదర్‌పాష, బాబా, మస్తాన్, భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా రాములు బాధ్యతల స్వీకరణ

అచ్చంపేట రూరల్: పట్టణ ఎస్‌ఐగా కె.రాములు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వర్తించిన గోవర్ధన్ నాగర్‌కర్నూల్ టౌన్‌కు బదిలీపై వెళ్లారు. బిజినేపల్లి నుంచి ఎస్‌ఐ రాములు అచ్చంపేటకు బదిలీపై వచ్చారు.

చారకొండ: మండల నూతన ఎస్‌ఐగా రాజశేఖర్ పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన రవి బదిలీపై వెల్దండకు వెళ్లారు. మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్ బదిలీపై చారకొండ వచ్చారు.

నూతన అధ్యక్షుడికి ఘన సన్మానం

వెల్దండ: ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన ఎర్ర శ్రీనివాస్‌ముదిరాజ్‌ను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్, భూపతిరెడ్డి, పర్వత్‌రెడ్డి, కృష్ణముదిరాజ్, పుల్లయ్య, మల్లేష్‌ముదిరాజ్, రమేష్, గోపాల్ తదితరులు ఉన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

కోడేరు: ఈనెల 12, 13 తేదీలలో ఖమ్మంలో నిర్వహించే టీపీటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ వెంకట్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు రాజాపూర్‌లో ఆయా పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విద్య రంగానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



అచ్చంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం అచ్చంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శాంతాబాయి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా ఆయా శాఖల అధికారులు ఎజెండా అంశాలను చదవుతుండగా ఎమ్మెల్యే జోక్యం చేసుకొని ఇలాంటి పద్ధతికి స్వస్తి పలికి నేరుగా సమస్యలపై చర్చించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్య, వైద్యానికి పెద్ద పీట వేస్తామన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. విధుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవికాలం ముగిసిందని ప్రత్యేకాధికారులు గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశానికి హాజరు కాని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని ఎంపీడీఓ మధుసూదన్‌గౌడ్‌ను ఆదేశించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయని కాంట్రాక్టర్లకు షోకాజ్ నోటీసులు అందించాలని సూచించారు. అచ్చంపేటను డ్రగ్స్ ఫ్రీ అచ్చంపేటగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. అంతకుముందు ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పదవీకాలం ముగిసిన సర్పంచులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మంత్రియానాయక్, వైస్ ఎంపీపీ అమరావతి, ఎంపీడీఓ మధుసూదన్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాజిరెడ్డి, అధికారులు సందీప్‌రెడ్డి, మధు, కృష్ణయ్య, రామారావు, బాలరాజు, విజయ, దమయంతి, తాజా మాజీ సర్పంచులు లోక్యానాయక్, బోడ్కనాయక్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌పై ప్రజల్లో సానుభూతి ఉంది

- ఈ పరిస్థితిని పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో సానుకూలంగా మలుచుకోవాలి
- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి అనేక కారణాలు
- ఎల్లప్పుడూ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా
- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: మాజీ సీఎం కేసీఆర్‌పై ప్రజల్లో సానుభూతి వెల్లువలా ఉందని, ఈ పరిస్థితిని పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో సానుకూలంగా మలుచుకోవాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శుక్రవారం నాగర్‌కర్నూల్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో తెలకపల్లి, నాగర్‌కర్నూల్ రూరల్ మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే కథానాయకులని, కార్యకర్తల వల్లే ఇన్నేళ్లుగా పార్టీ బలంగా ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి అనేక కారణాలు ఉన్నాయని, కేవలం 5 వేల ఓట్లతో దాదాపు 20 మంది ఎమ్మెల్యేలు ఓడిపోయారని చెప్పారు. రాష్ట్రం మొత్తం కేవలం 1.5 నుంచి 2 శాతం ఓట్లతో అధికారం కోల్పోయానికి, పార్టీకి, ప్రభుత్వానికి సమన్వయం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఎదురైందని అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియాలో జరిగిన అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టలేకపోయామని, అవతలి వాళ్ల అభూత కల్పన, అబద్దాలతో ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ వాళ్లు కూడా అనుకోలేదని, అందుకే ఇష్టారీతిగా హామీలు ఇచ్చారని ఆరోపించారు. రాబోయే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటి.. పార్టీకి పూర్వవైభవం తీసుకువద్దామని పిలుపునిచ్చారు. ఎల్లప్పుడూ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని, ఎవరైనా తమ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌యాదవ్, నాగం శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ప్రత్యేక అధికారులు



కోడేరులో విధుల్లో చేరిన ప్రత్యేక అధికారి ఎంపీఓ శ్రావణ్‌కుమార్

కల్వకుర్తిరూరల్: సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించారు. శుక్రవారం మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు నియామకం అయిన ప్రత్యేకాధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మార్చాలకు ఎంపీడీఓ ఆంజనేయులు, తర్నికల్‌కు ఎంపీడీఓ దేవేందర్, కురుమిద్దెకు ఎంఈఓ బాసూనాయక్‌ను ప్రత్యేకాధికారులుగా కేటాయించారు.

కోడేరు: మండలంలోని 22 గ్రామపంచాయతీకు నియమించిన ప్రత్యేక అధికారులు శుక్రవారం విధుల్లో చేరారు. గ్రామాల అభివృద్ధికి మాజీ సర్పంచ్‌లు, ప్రజలు తమకు సహకరించాలని కోరారు.

చారకొండ: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు. చారకొండ, శాంతిగూడెంకు ఎంపీడీఓ వెంకటేష్, సిర్సనగండ్ల, అగ్రహారంతండా, గైరాన్ తండాకు పీఆర్ ఏఈ మోనిక, తుర్కలపల్లి, శేరిఅప్పారెడ్డిపల్లికి డీటీ విద్యాధరి, సారంబండ తండాకు మండల పశువైద్యఅధికారి శివకుమార్, మర్రిపల్లి, రామచంద్రాపురం, గోకారం ఏఓ చిన్న హేస్సేన్, కమాల్‌పూర్ తండా, జూపల్లి, ఎర్రవల్లి కి తహసీల్దార్ ప్రమీల, తిమ్మాయిపల్లి, జేపల్లి మిషన్ భగీరథ ఏఈ రితిష్, చంద్రాయన్‌పల్లి ఇరిగేషన్ ఏఈ విశ్వనాథ్‌లు ప్రత్యేక అధికారులుగా నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అధికారులు బాధ్యతులు చేపట్టారు.

అమ్రాబాద్: అమ్రాబాద్ మండలంలో 24 గ్రామ పంచాయతీలకు, పదర మండలంలో 10 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది.ఈ మేరకు శుక్రవారం అధికారులు బాధ్యతలు స్వీకరించారు.

బీజేపీ నాయకుడికి ఘన నివాళి

మన్ననూర్: బీజేపీ అమ్రాబాద్ మండల అధ్యక్షుడు శంకర్‌జీ వర్ధంతిని శుక్రవారం గ్రామంలో నిర్వహించారు. మన్ననూర్‌లోని ఆయన సమాధిపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు మండికారి బాలాజీ మాట్లాడుతూ అమ్రాబాద్ మండలంతో పాటూ అచ్చంపేట నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి శంకర్‌జీ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గోలి రాజు, నారాయణమ్మ, శ్రీనివాసులు, గంగాజీ, చందు, మల్లాజీ, శాంతి కుమార్, శ్రీకాంత్, అంజి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మోర్చా అధ్యక్షుడికి సన్మానం



కల్వకుర్తిరూరల్: బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకం అయిన కల్యాణ్ శుక్రవారం హైదరాబాద్ పార్టీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు కల్యాణ్ నాయక్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దుర్గాప్రసాద్, పట్టణ అధ్యక్షుడు నర్సింహా, రవిగౌడ్, సాయి ఉన్నారు.

చారకొండ: బీజేపీ సీనియర్ నాయకుడు కల్యాణ్‌ను బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ కల్యాణ్‌ను నియామకంఅయ్యారు. శుక్రవారం బాధ్యతల స్వీకరణ సందర్భంగా హైదరాబాద్‌లో బీజేవైఎం నాయకులు నేనావత్ రవి నాయక్, పలువురు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



అమ్రాబాద్: మండలంలోని జంగంరెడ్డిపల్లిలో నిర్వహిస్తున్న జాతీయ ఉపాధిహామీ పనులను శుక్రవారం ఎంపీడీఓ రామ్మోహన్, ఎంపీఈఓ వెంకటయ్య, ఈసీ రేణయ్య తదితరులు సందర్శించి పరిశీలించారు. ఉపాధి హామీ పథకం ప్రారంభమై 18 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా రైతు మలయ్య పొలంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

లింగాల: యాసంగిలో సాగు చేసిన వరి పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ నాగార్జునరెడ్డి రైతులకు సూచించారు. మండల కేంద్రం శివారులో సాగు చేసిన వరి పంటను శుక్రవారం ఏఓ పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం పంటలో జింక్ లోపం ఉందని దీని నివారణకు లీటర్ నీటిలో 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి ఎకరా పొలానికి పిచికారి చేసుకోవాలన్నారు. పంటలో చీడపీడల నివారణకు మోతాదుకు మించి మందులను వాడితే పంటకు నష్టం కలుగుతుందని ఏఓ తెలిపారు.

రైతులకు నాణ్యమైన సేవలు

లింగాల: రైతులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నామని అచ్చంపేట డీసీసీబీ మేనేజర్ ఎం.శేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో లింగాల, దత్తారం, సూరాపూర్ రైతులకు బ్యాంక్ ద్వారా అందించే వివిధ రకాల సేవల గురించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు డీసీసీబీలో ఖాతాను తెరవాలని దీని వలన 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు కలిగిన వారు రూ.436 ప్రతి ఏటా బీమా ప్రీమియం చెల్లిస్తే ప్రమాద బీమా రూ. 2 లక్షల వరకు పొందవచ్చన్నారు. 50 నుంచి 70 వయస్సు గల వారు ప్రధాని సురక్షా యోజన ద్వారా రూ.20 చెల్లిస్తే ప్రమాద బీమా రూ.2 లక్షల వరకు పొందే అవకాశం ఉందన్నారు. ఎఫ్‌ఓ మోహన్, సొసైటీ సీఈఓ పాండు, రైతులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ

కోడేరు: మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్మాణానికి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ ఖరీం, రంగినేని జగదీశ్వర్‌రావు భూమి పూజ చేశారు. ఆయా గ్రామాల నుంచి ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సురేందర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, చలపతిరావు, చామంతి రాజు, ఇమ్రాన్, బాబు, మాసుం, శరత్‌బాబు, రాజు, రామకృష్ణ, మిద్దె నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈజీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ఉప్పునుంతల: మండల కేంద్రంతోపాటు పెద్దాపూర్ గ్రామాల్లో శుక్రవారం జాతీయ ఉపాధిహామీ పథకం (ఈజీఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పనుల వద్ద ఉపాధిహామీ కూలీలతో కలిసి స్వీట్లు పంచుకొని సంతోషాన్ని పంచుకున్నారు. మండలంలోని పెద్దాపూర్‌లో అత్యధికంగా 59 కుటుంబాలు వంద రోజులు పనిదినాలు పూర్తిచేసినందున ఫీల్డ్ అసిస్టెంట్ మశన్నను శాలువాతో సన్మానించారు. మండల కేంద్రంలో ఈజీఎస్ ఏపీఓ సుదర్శన్‌గౌడ్, ఫీల్డ్ అసిస్టెంటు మల్లయ్య, టీఏ సింగోటంను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సరిత, నాయకుడు అనంతరెడ్డి, టీఏలు ఉమాపతి, సుఖజీవన్, సత్యనారాయణ, రాజు, పంచాయతీ కార్యదర్శి రాజరత్నం, ఈజీఎస్ కూలీలు పాల్గొన్నారు.

వంశీచంద్‌ను కలిసిన ఆశాదీప్‌రెడ్డి

కల్వకుర్తిరూరల్: పాలమూరు న్యాయ యాత్ర చేస్తున్న కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డిని శుక్రవారం మక్తల్‌లో మండలంలోని తాండ్ర గ్రామానికి చెందిన రాష్ట్ర నాయకుడు ఆశాదీప్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేయడంతో పాటు వంశీచంద్ రెడ్డి వెంట పాలమూరు న్యాయ యాత్రలో భాగస్వామి అయ్యారు. ఆయన వెంట పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై నిర్లక్ష్యం చేయొద్దు

చారకొండ: గ్రామాల్లో ఉపాధి పనులపై అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీడీఓ వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలో ప్రత్యేక అధికారిగా బాధ్యతులు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. అనంతరం క్షేత్రస్థాయిలో ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి గణేష్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు ఉన్నారు.



ఉపాధి కూలీల వివరాలు తెలుసుకుంటున్న ప్రత్యేక అధికారి వెంకటేష్

ఇరుకు గదులతో ఇబ్బందులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ భవనంలో గదులు ఇరుకుగా ఉండటంతో సమావేశాలు నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో దేవాలయం వద్ద గ్రామసభలు ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోయారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం రూర్బన్ మిషన్‌లో భాగంగా రూ.40 లక్షల మంజూరు అయిన కాంట్రాక్టర్ పనులు చేయడంలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వార్షికోత్సవాన్ని విజయవంతం చేయండి

తెలకపల్లి: హ్యూమన్ హెల్పర్ ఫౌండేషన్ మానవ సంక్షేమ సంస్థ 3వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంస్థ అధ్యక్షుడు ఫౌండర్ శివశంకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 16న నిర్వహించే వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా ఈటీవీ యాంకర్ అఖిల్, గాయకుల గడ్డం రమేష్‌లు హాజరవుతారని పేర్కొన్నారు. కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డిలు పాల్గొంటారని తెలిపారు.

15న సెలవు దినంగా ప్రకటించాలి

కందనూలు: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాముడు నాయక్, బాలునాయక్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చిన్నకష్ణ నాయక్, రాజునాయక్, సీతారాం నాయక్, బాష, గోపినాయక్, అడ్వకేట్ రోజెస్ నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన డీఈఓ



బహుమతి అందుకుంటున్న విద్యార్థి సాయిసాత్విక్

తెలకపల్లి: మండల కేంద్రంలోని కేకేరెడ్డి ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి సాయిసాత్విక్‌ను డీఈఓ గోవిందరాజులు అభినందించారు. భారత దేశ విద్య, వైజ్ఞానిక ప్రదర్శన సైన్స్‌ఫేర్‌లో విద్యార్థి సాయిసాత్విక్ బహుళార్థక సాధక వ్యవసాయ పరికరం ప్రాజెక్టు రూపొందించి ప్రదర్శించి ద్వితీయ బహుమతి పొందారు. బెంగుళూరుకు చెందిన విశ్వేశ్వరయ్య మ్యూజియం, ఆంధ్రప్రదేశ్ శాఖ సంయుక్తంగా విజయవాడలో గత నెల 28 నుంచి నిర్వహిస్తున్న వైజ్ఞాన ప్రదర్శనలో సాయిసాత్విక్ ప్రతిభ కనబరిచారు. ఈ ప్రదర్శనలో నేల తేమ శాతాన్ని గుర్తించి అవసరమైన నీటి సరఫరాను పంట సంరక్షణ, జీవశాస్త్ర ఎరువుల రవాణ తదితర పనులను సౌరశక్తి ద్వారా ఎలా వినియోగించవచ్చనే పరికరం ప్రాజెక్టుతో దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో పలువురు శాస్త్రవేత్తలను ఆకర్షించిందని చెప్పారు. ఈ ప్రదర్శనకు రెండో బహుమతి లభించడం ఎంతో విశేషం అన్నారు. అలాగే జిల్లా సైన్స్అధికారి కృష్ణారెడ్డి, కేకేరెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని అభినందించారు.

డప్పు కళాకారుల కమిటీ ఎంపిక



నియామకపత్రం అందజేస్తున్న డప్పు కళాకారుల సంఘం నాయకులు

తాడూరు: మండల డప్పు కళాకారుల కమిటీని శుక్రవారం ఎంపిక చేసినట్లు కళాకారుల సంఘం నాయకులు డప్పు రవి తెలిపారు. ఈ సందర్భంగా జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్ ఆధ్వర్యంలో మండల కమిటీ అధ్యక్షుడిగా రవీందర్, ఉపాధ్యక్షుడిగా రాము, ప్రధాన కార్యదర్శిగా మహేష్, కార్యదర్శులుగా గోపి, బాలీశ్వర్, కోశాధికారిగా శ్రీశైలంతోపాటు 10 మంది సభ్యులను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంచందర్, కేకే గౌడ్, భీమయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

విషపు ఎరతో కత్తెర పురుగు నివారణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న రావేఫ్ విద్యార్థినులు

తాడూరు: పాలెం కేవీకే రావేఫ్ విద్యార్థినుల ఆధ్వర్యంలో మండలంలోని యత్మతాపూర్, ఇంద్రకల్ గ్రామాల్లో రైతులకు విషపు ఎరతో కత్తెర పురుగు నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. విషపు ఎరను ఎలా తయారు చేయాలనే వివరాలను రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. విషపు ఎర అనేది బాగా ప్రావీణ్యం పొందిందని దీన్ని తయారు చేసే విధానంలో 10 కిలోల తవుడు, కిలో బెల్లం, 500 మి.లీ., మోనోక్రోటోపాస్ ఉపయోగించాలన్నారు. దీనిని చిన్న ఉండలుగా చేసుకుని సాయంత్రం వేళల్లో మొక్కజొన్న పొలంలో పిచికారీ చేస్తే కత్తెర పురుగును నివారించవచ్చని చెప్పారు. విషపు ఎరను వాడడం వల్ల రసాయనిక ఎరువుల వాడకం తగ్గించడమే కాకుండా ఖర్చు బాగా తగ్గి పంట దిగుబడి పెరుగుతుందన్నారు. విద్యార్థినులు నవత, సానియా, సింధూర, ప్రవళిక, రమ్య, నివేదిత, రైతులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలన

మండలంలోని అంతారంలో ఏఓ సాయిరమేష్‌కుమార్ శుక్రవారం రైతు ఎల్లయ్య సాగు చేసిన మొక్కజొన్న, వేరుశనగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మొక్కజొన్నలో కత్తెర పురుగు గమనించి వాటి నివారణ చర్యల గురించి వివరించారు. కలుపు వల్ల దిగుబడి తగ్గుతుందని, వెంటనే కలుపు మందు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ ఫయాజ్ పాల్గొన్నారు.

అట్టలతో చీడపీడల నివారణ

తెలకపల్లి: అట్టలతో చీడపీడల నివారణ తగ్గించుకోవచ్చని పాలెం కేవీకే వ్యవసాయ కళాశాల రావేఫ్ విద్యార్థులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పర్వతాపూర్‌లో రైతులకు పంటలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రావేఫ్ విద్యార్థులు ద్వారకామయి, విశ్వతేజ, సుభద్ర, శ్వేత, అనూజ, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు



బస్సును ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ సత్యనాయక్

వెల్దండ: మండలంలోని చెర్కూర్, భర్కత్‌పల్లి, గాన్‌గట్టుతండాలకు శుక్రవారం మహేశ్వరం డిపో మేనేజర్ సహకారంతో గ్రామాల్లో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు బస్సుకు పూజలు నిర్వహించారు. ఇటీవల గ్రామాల్లో బీటీరోడ్డు నిర్మించడంతో మహేశ్వరం డిపో మేనేజర్ సర్వే చేసి గాన్‌గట్టుతండా, ఆమనగల్లు, ఐఎస్ సదన్, హైదరాబాద్ వరకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. ఉదయం 8 గంటలకు, సాయంత్రం 3 గంటలకు రెండుపూటలు బస్సు రాకపోకలు కొనసాగిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనాయక్, ఆయా గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

రైతులకు అవగాహన



కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎన్మన్‌బెట్ల రైతువేదికలో మామిడి పంటలో చేపట్టవలసిన యాజమాన్యం పద్ధతులు, వరిలో డ్రమ్ సీడర్‌పై వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు శుక్రవారం అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, పూత, పిందే, పూత దశలో ఆశించే చీడ పీడ నివారణ చర్యలపై పిందే పెరుగుదల దశలలో చేపట్టవలసిన నీటి యాజమాన్యం వంటి విషయాలపై కేవీఎస్ ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఆది శంకర్, కొల్లాపూర్ ఉద్యాన అధికారి లక్ష్మణ్ రైతులకు వివరించారు. అదేవిధంగా డ్రమ్ సీడర్ ద్వారా వరి పంట సాగు గురించి కూడా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్ర వేత్త రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారి నాగరాజు, టెక్నికల్ మెనేజర్ ఫణికుమార్, ఏఈఓ శ్రీకాంత్, మహేష్, అజయ్, మాజీ సర్పంచ్ నాగరాజు, భాస్కర్ గౌడ్, మాజీ ఎంపీపీ నిరంజన్ రావు, తదితర రైతులు పాల్గొన్నారు.

రేపు టీఎంయూ సభ

అచ్చంపేట రూరల్: హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ హిమగిరి గార్డెన్‌లో ఈ నెల 4న టీఎంయూ రాష్ట్ర సభను నిర్వహిస్తునట్లు తెలంగాణ మజ్దూర్ యూనియన్ స్టేట్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ మోహన్‌లాల్ అన్నారు. శుక్రవారం అచ్చంపేట ఆర్టీసీ డిపో ఆవరణలో టీఎంయూ ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభకు అన్ని ఆర్టీసీ డిపోల నుంచి కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీఎంయూ రాష్ట్ర కార్యదర్శి నాగయ్యగౌడ్, డిపో ప్రెసిడెంట్ ఎ. జంగిరెడ్డి, నాయకులు ఏకే గౌడ్, జేఆర్ రెడ్డి, వెంకటయ్య, టీఆర్‌సీ రెడ్డి, బీఎస్ స్వామి పాల్గొన్నారు.



అచ్చంపేటలో మాట్లాడుతున్న మోహన్‌లాల్

విద్యుదాఘాతంతో గేదె మృతి

వెల్దండ: మండలంలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు సొప్పరి కృష్ణమ్మకు సంబంధించిన గేదె శుక్రవారం మృతి చెందింది. వాగులో గేదె మేతమేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ దాదాపుగా రూ.80 వేలు ఉంటుందని బాధితురాలు తెలిపారు.